# దిగజారుడు ఆరోపణలు మానుకోవాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

- ఓటమి భయంతోనే సీతక్క అసత్య ఆరోపణలు
- నేను ఎవ్వరికి బినామీ కాదు..
- సీతక్కపై కేసు నమోదు చేయాలి
- ములుగులో సీతక్కను ఓడిస్తాం
- ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

హనుమకొండ, నవంబర్ 14 : ములుగు ఎమ్మెల్యే సీతక్కపై ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఫైర్ అయ్యారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతికి వస్తున్న ఆదరణను ఓర్వలేక తాను ఓడిపోతాననే భయంతో సీతక్క బీఆర్‌ఎస్, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, హరీశ్‌రావుపై చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలని హెచ్చరించారు. మంగళవారం హనుమకొండలోని నిత్య బాంక్వెట్ హాల్‌లో పోచంపల్లి విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ తనను ఓడించాలని పగబట్టారని ఆరోపించడం శోచనీయమన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని అన్ని నియోజక వర్గాలకు ఇన్‌చార్జిలను నియమించారన్నారు. బడే నాగజ్యోతిని గెలిపించేందుకే తనను ములుగు ఇన్‌చార్జిగా పంపారని స్పష్టం చేశారు. సీతక్కను ఓడించడమే తమ లక్ష్యమన్నారు. ఎమ్మెల్యేగా సీతక్క ములుగు నియోజక వర్గానికి చేసింది ఏమీ లేదన్నారు. కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ నుంచి వందల కోట్లు తీసుకొచ్చి ములుగులో సీతక్క గెలువాలని చూస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే రూ.80 కోట్లు తీసుకొచ్చి ఎక్కడ దాచిపెట్టిందో ప్రజలకు తెలుసన్నారు. దొంగనోట్లు, స్పిరిట్ కల్పిన మద్యం పంచుతున్నారని తమపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం, డబ్బులు పంపిణీ చేయడం కాంగ్రెస్ పార్టీకే అలవాటన్నారు. మీరే దొంగ సారా తయారు చేసి పంపిణీ చేస్తున్నారేమోనని అనుమానం వ్యక్తం చేశారు. మద్యం, డబ్బుల పంపిణీ విషయంలో ఎన్నికల కమిషన్, ఎక్సైజ్ శాఖ అధికారులు సీతక్కపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్‌కౌంటర్‌లో తల్లిదండ్రులను కోల్పోయిన నిరుపేద ఆడబిడ్డ నాగజ్యోతి ప్రతిష్ఠను దిగజార్చే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, సీతక్క దిగజారుడు ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో ములుగు ప్రాంతం అభివృద్ధి జరిగిందన్నారు. ములుగును జిల్లా చేసి మెడికల్ కళాశాలతో పాటు వంద పడకల దవాఖానగా మార్చామన్నారు. ఏటూరునాగారాన్ని డివిజన్ చేయడంతో పాటు ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేశామన్నారు. అలాగే మల్లంపల్లిని మండల కేంద్రంగా మార్చామని, రోడ్లు మెరుగు పరిచామని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ పదేండ్లలో చేసిన అభివృద్ధి గురించి చెపుతూ ఓట్లు అడుగుతున్నామన్నారు. మీరు ఇప్పటి వరకు ఏమి అభివృద్ధి చేశారో చెప్పి ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. ములుగు అభివృద్ధి విషయంలో సీఎం కేసీఆర్‌కు పలుమార్లు మీరు చెప్పిన కృతజ్ఞతలు గుర్తుకు లేవా ? అని ప్రశ్నించారు. కరోనా పేరు మీద కరెన్సీ కట్టలు సంపాదించుకున్నారని ములుగు ప్రజలు చర్చించుకుంటున్నారన్నారు. కెమెరాల ముందు రీల్స్ చేస్తుంది తప్ప వెనుక ఏమి చేయదనే ప్రజలు అంటున్నారని తెలిపారు. జాతీయ నాయకురాలును కావాలని రాహుల్‌గాంధీ పాదయాత్రలో పాల్గొన్న సీతక్క ములుగు ప్రజల విశ్వాసం కోల్పోయారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నాకు నిధులు ఇవ్వడం లేదని తప్పించుకొనే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. తాను ఎవరికి బినామీ కాదని నార్కో అనాలసిస్ టెస్ట్‌కు తాను సిద్ధమని మీరు సిద్ధమా అని సీతక్కకు సవాల్ విసిరారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతిపై సీతక్క చేస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. సీతక్క చేస్తున్న ఆరోపణలపై సుమోటోగా కేసు నమోదు చేయాలని లేని పక్షంలో సీతక్క బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని తెలుసుకోవాలన్నారు. నాగజ్యోతికి వస్తున్న ప్రజాదరణతో ఓడిపోతాననే ఫ్రస్టేషన్‌లో సీతక్క తప్పుడు ఆరోపణలు చేస్తుందన్నారు. ములుగులో బడే నాగజ్యోతి భారీ మెజారిటీతో గెలువడం తథ్యమన్నారు.

మాజీ ఎంపీ సీతారాం నాయక్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులను తరిమికొట్టాలని సీతక్క పిలుపునివ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తాను స్టార్ క్యాంపెయినర్‌గా రేపు ములుగుకు వస్తున్నానని తనను ఎవరు అడ్డుకుంటారో చూస్తానని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన చైర్మన్ మెట్టు శ్రీనివాస్, ములుగు జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ రావు, ములుగు గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు మల్క రమేశ్, కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ భవేశ్‌మిశ్రా, అధికారులు

## ఓటర్లందరికీ స్లిప్పులు అందించండి

### జాయింట్ ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్

భూపాలపల్లి రూరల్, నవంబర్ 14: ఓటర్లందరికీ తప్పనిసరిగా ఓటర్ స్లిప్పులు అందేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్ ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి సర్ఫరాజ్ అహ్మద్, ఇతర రాష్ట్ర స్థాయి అధికారులతో కలిసి వెబ్ క్యాస్టింగ్ నిర్వహణ, ఓటర్ స్లిప్పుల పంపిణీపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ స్లిప్పులు ముద్రించి వాటిని ఓటర్లందరికీ అందించాలన్నారు. ఓటర్ స్లిప్పుల పంపిణీపై ప్రతిరోజూ నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ భవేశ్ మిశ్రా, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి లలితా శివజ్యోతి

## బాలల హక్కులను పరిరక్షించాలి

### జడ్జి లలితా శివజ్యోతి

ములుగురూరల్, నవంబర్14 : నేటి బాలలే రేపటి పౌరులని, బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ములుగు జిల్లా కోర్టు జడ్జి లలితా శివజ్యోతి అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో డీఈఓ పాణిని అధ్యక్షతన నిర్వహించిన వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బాలల చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని, వారి చర్యలను ఎప్పటికప్పుడు గమనిస్తూ తల్లిదండ్రులు తగు సూచనలు ఇవ్వాలన్నారు. సరైన విద్యతోనే మెరుగైన సమాజ నిర్మాణం జరుగుతుందన్నారు. 14 సంవత్సరాలలోపు బాలలను పనికి పంపకుండా బడికి పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ కోర్టు జడ్జి మాధవి, న్యాయవాదులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కోటగుళ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు

కోటగుళ్లను పరిశీలిస్తున్న పురావస్తు శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాములు నాయక్ →



### రాష్ట్ర పురావస్తు శాఖ డిప్యూటి డైరెక్టర్ రాములు నాయక్

గణపురం, నవంబర్ 14 : మండల కేంద్రంలోని కోట, రెడ్డి గుళ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు రాష్ట్ర పురావస్తు శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాములు నాయక్ తెలిపారు. మంగళవారం ఆయన కోటగుళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకతీయులు నిర్మించిన ఆలయాలను పరిశీలించి వాటి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఆలయాల పునరుద్ధరణకు నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. ఆయన వెంట వరంగల్ అసిస్టెంట్ డైరెక్టర్ మల్లు నాయక్ ఉన్నారు.

# నాగజ్యోతిని దీవించిన 'కల్యాణలక్ష్మి' కుటుంబం

ములుగు, నవంబర్14 (నమస్తే తెలంగాణ) : ములుగు నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి ఎన్నికల ప్రచారంలో భాగంగా ములుగు మండలం భాగ్య తండాకు చేరుకున్నారు. 'కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్' పథకానికి ప్రేరణ అయిన కీమానాయక్–రుక్కమ్మ ఇంటికి చేరుకున్నారు. కీమానాయక్ దంపతులు, పథకానికి కారకురాలైన కల్పన–యాకు దంపతులు నాగజ్యోతిని సాదరంగా ఇంట్లోకి ఆహ్వానించారు. నాగజ్యోతికి చీరెను అందించి నిండు మనస్సుతో దీవించారు. అనంతరం నాగజ్యోతి తన వెంట వచ్చిన నాయకులతో పాటు కీమానాయక్ కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా కీమానాయక్ మాట్లాడుతూ నాడు ఉద్యమ నాయకుడిగా 20ఏళ్ల కింద కేసీఆర్ తన కూతురు కల్పన పెళ్లిని సొంత ఖర్చులతో చేసి దీవించాడని గుర్తు చేసుకున్నారు. రెండేళ్ల క్రితం ముఖ్య మంత్రి హోదాలో తన మనవరాలు చంద్రకళ పెళ్లి చేయించే బాధ్యతను నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి అప్పగించి ఘనంగా జరిపించారని తెలిపారు. ఉద్యమ సమయంలో ఆడపిల్లల పెళ్లి కష్టాన్ని తెలుసుకున్న కేసీఆర్ సీఎం అయ్యాక కల్యాణలక్ష్మి లాంటి గొప్ప పథకాన్ని అమలు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి గొప్ప పథకానికి తమ కుటుంబం కారణం కావడం తమకు ఎంతో గర్వకారణమన్నారు. తమ గ్రామంలో 70మందికి కల్యాణలక్ష్మి పథకం వర్తించిందన్నారు. కల్పన మాట్లాడుతూ తండ్రి తర్వాత తండ్రిగా తనకు పెళ్లి చేసిన కేసీఆర్ సీఎం అయిన తర్వాత ఏ ఆడ బిడ్డకు తన లాంటి కష్టం రావద్దని కల్యాణ లక్ష్మి పథకం ద్వారా 1లక్షా 116లను అందించడం గొప్ప విషయమన్నారు. ఆయన దేవుడితో సమానమని కొనియాడారు. అనంతరం నాగజ్యోతి మాట్లాడుతూ కల్యాణలక్ష్మి వంటి పథకం ములుగు జిల్లాలో పురుడు పోసుకోవడం గొప్ప విషయమని తెలిపారు. కీమానాయక్ ఆమె కుమార్తె కల్పన బాధను చూసిన కేసీఆర్ చలించి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. రెడ్‌కో చైర్మన్ సతీశ్‌రెడ్డి మాట్లాడుతూ భాగ్యతండాతో పాటు కల్యాణలక్ష్మి పథకానికి కారకులైన కీమానాయక్ అతడి కుమార్తె కల్పన రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతారన్నారు. ఆడబిడ్డల దీవెనలు ఉన్నంత వరకు సీఎం కేసీఆర్‌తో పాటు బీఆర్‌ఎస్ పార్టీకి ఢోకా లేదన్నారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



కీమానాయక్ కుటుంబ సభ్యులతో బడే నాగజ్యోతి

## రామప్పలో ఆస్ట్రేలియా దేశస్తుడు



రామప్పలో పూజలు చేస్తున్న పాడ్డీ

వెంకటాపూర్, నవంబర్ 14 : మండలంలోని రామప్ప దేవాలయంను ఆస్ట్రేలియా దేశస్తుడు పాడ్డీ మంగళవారం సందర్శించారు. ఆలయ అర్చకులు పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ విశిష్టతను ఆసక్తిగా టూరిజం గైడ్ ద్వారా తెలుసుకున్నారు. అనంతరం రామప్ప సరస్సును సందర్శించారు. ఆయన వెంట వంశీ, శ్రీనివాస్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

## కాళేశ్వరంలో ఎన్నికల అబ్జర్వర్ పూజలు

కాళేశ్వరం, నవంబర్14 : కాళేశ్వర ముక్తీశ్వరాలయంలో మంగళవారం ములుగు ఎన్నికల అబ్జర్వర్ నవీన్ బన్సాల్ పూజలు చేశారు. వారికి ఆలయం అర్చకులు స్వాగతం పలికారు. ఆలయంలో పూజలు చేసి సన్మానించారు.



అశీర్వదిస్తున్న పూజారులు